పెద్దగట్టు జాతర రూట్‌మ్యాప్ విడుదల

- 16న తెల్లవారుజాము నుంచి జాతీయ రహదారి 65పై ఆంక్షలు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 10: పెద్దగట్టు జాతర నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ తెల్లవారుజాము నుంచి జాతీయ రహదారి 65పై ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల మళ్లింపు, జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలకు సంబంధించి రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

వాహనాల మళ్లింపు ఇలా..

హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద దారి మళ్లించి నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా విజయవాడకు పంపించడం జరుగుతుందన్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ వద్ద మళ్లించి హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడెం, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు టేకుమట్ల వద్ద జాతీయ రహదారి 365బీ మీదుగా వెళ్లాలని తెలిపారు. కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేటకు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఎస్సారెస్పీ కెనాల్, బీబీ గూడెం మీదుగా సూర్యాపేటకు మళ్లించనున్నట్లు తెలిపారు. సూర్యాపేట నుంచి కోదాడ, విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కుడకుడ గ్రామం, రాఘవాపురం స్టేజీ, నామవరం, గుంజలూరు స్టేజీ మీదుగా పంపించనున్నట్లు తెలిపారు.

పార్కింగ్ స్థలాలు..

సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను జాతీయ రహదారి 65పై హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రాంకోటి తండాకు వెళ్లే మార్గంలో, గరిడేపల్లి, పెన్‌పహాడ్ వైపు నుంచి వచ్చే వాహనాలను పాత కలెక్టరేట్ వెనుక భాగంలో, కోదాడ, మునగాల, గుంపుల వైపుగా వచ్చే వాహనాలను ఖాసీంపేట గ్రామానికి వెళ్లే మార్గంలో, మోతె, చివ్వెంల మీదుగా వచ్చే వాహనాలను చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్ తండా వద్ద గట్టుకు వెనకాల పార్కింగ్ స్థలం కేటాయించినట్లు ఎస్పీ వెల్లడించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

చింతలపాలెం, ఫిబ్రవరి 10: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మధిర సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కోఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కందుకూరి కాటయ్య, రుద్రపంగు సాయిబాబా, అమరబోయిన శ్రీనివాస్ యాదవ్, సూరంశెట్టి హనుమంతరావు, నరసింహారావు, మైబల్లిని నియమించినట్లు సత్యనారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కొత్తమద్ది వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు మోర్తాల వెంకటరెడ్డి, సయ్యద్ సైదా, సత్యం, రోశిరెడ్డి, మధు పాల్గొన్నారు.

'క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం'

గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నాగారం, ఫిబ్రవరి 10: మండలంలోని పసునూరు గ్రామంలో సోమవారం క్షయ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బొమ్మగాని హర్షవర్ధన్ మాట్లాడుతూ.. క్షయ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం, ఆయాసం ఉండడం, ఆకలి లేకపోవడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. క్షయ నిర్ధారణ అయితే మందులు వాడి పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. వంద రోజుల నిక్షయ శివర్ కార్యక్రమంలో భాగంగా ప్రారంభ దశలో క్షయ వ్యాధిని గుర్తించి ఆరు నెలల పాటు మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్, హెచ్ఈ విమలమ్మ, పీహెచ్ఎన్ అరుణకుమారి, సూపర్‌వైజర్ రామచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి : సెర్ప్ ఏపీఎం

నూతనకల్, ఫిబ్రవరి 10: బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని సెర్ప్ ఏపీఎం రమణాకర్ అన్నారు. సోమవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలు రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. సభ్యులు సుమారు 15 నుంచి 20 మంది కలిసి రైతు మిత్ర సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో ప్రతి కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. సెర్ప్ సిబ్బంది ముత్తయ్య, మల్లేశ్, సరస్వతి, గీత పాల్గొన్నారు.

'సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న బాబునాయక్

మోతె, ఫిబ్రవరి 10: కోదాడలో ఈ నెల 15న నిర్వహించనున్న లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోతు బాబునాయక్ కోరారు. సోమవారం మోతెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఎంపీడీఓ ఆంజనేయులును కలిసి విన్నవించారు. కార్యక్రమంలో భూక్యా రవినాయక్, ధారావత్ కృష్ణనాయక్, బి.రాజునాయక్, బాణోతు నందలాల్‌నాయక్, సాజ్యనాయక్, మాలోత్ కోటినాయక్, బాణోతు బాలాజీనాయక్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1. MAHINDRA JEETO PLUS 16 BS VI TS29TB2258
2. TATA ACE HT PLUS BS VI TS29TB3243
3. PIAGGIO APE CITY NXT+CNG BSVI TS29TB7835
4. BAJAJ RE DIESEL BS VI AP39VC8815
5.PIAGGIO APE CITY NXT+CNG BSVI TS29TB7828
Cell No. 7337351819
D.No.797, 1st Floor Bharath Reddy Complex, Main Road, Kodada, Suryapet (Dist.), 508206

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులి: 9182777638

ముందస్తు కంకులకు యూరియాతో నష్ట నివారణ

- కంపసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

కోదాడ రూరల్: కూచిపూడిలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

మునగాల, ఫిబ్రవరి 10: వరి సాగులో యాజమాన్య లోపాలతోనే సమస్యలు తలెత్తుతున్నాయని కంపసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీధర్, సంధ్యారాణి అన్నారు. సోమవారం మండలంలోని తాడువాయి, వెంకట్రామాపురం గ్రామాల్లో వరి పైర్లను వారు పరిశీలించి మాట్లాడారు. నవంబర్ 20వ తేదీ కంటే ముందుగా నారు పోయడం, ముదురు నారు పెట్టడం, దుక్కి మందుతో పాటు సరిపడా యూరియా వేయకపోవడం, వాతావరణంలో మార్పులు, జింక్ లోపం, చౌడు భూముల కారణంగా వరిలో తల్లి కర్ర ముందుగా ఈని సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముందస్తు కంకులు ఏర్పడి ఈనిన వరి పొలాలకు యూరియాతో నష్ట నివారణ చేయొచ్చని తెలిపారు. అదేవిధంగా సమస్య పరిష్కారానికి జింక్ సరిపడా వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లయ్య, ఏఓ రాజు, రైతులు శివకృష్ణ, నాగయ్య, సైదులు, ఉపేందర్‌రావు, అరవింద్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని కూచిపూడి, రెడ్లకుంట గ్రామాల్లో వరి పైర్లను శాస్త్రవేత్తలు శ్రీధర్, సంధ్యారాణి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లయ్య, ఏఓ రజని, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే : డీఎస్పీ రవి

మాట్లాడుతున్న డీఎస్పీ రవి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 10: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో అమ్మానాన్న గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అనాథాశ్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండి కూడా తల్లిదండ్రులను అనాథాశ్రమాల్లో చేర్పించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అనాథాశ్రమ నిర్వాహకులు పేద పోలు పుల్లయ్య, నిర్మల దంపతులతో పాటు కృష్ణకుమార్, టి.మోహన్, ఎస్.నవీన్, అలీ, జనార్ధన్, ఎం.సైదులు, పి.విష్ణుమూర్తి, పిచ్చయ్యగౌడ్, సాంబశివయ్య, సామేల్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 10: మండలంలోని చిల్లేపల్లి టోల్ గేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ.. టోల్‌గేట్‌కు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల ప్రజలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. యాజమాన్యం దిగిరాకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, చిలకరాజు శ్రీను, లక్ష్మి, వెంకన్న, వెంకట్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ మంజులత

నూతనకల్, ఫిబ్రవరి 10: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులత సూచించారు. సోమవారం మండలంలోని బిక్కుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త శోభ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎంఈఓ

అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ సలీంషరీఫ్, విద్యార్థులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 10: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎంఈఓ ఎండీ.సలీంషరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఎన్జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్) విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్, పాఠశాల హెచ్ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు బడుగుల సైదులు, వీరబ్రహ్మంచారి, కనకమ్మ, ముక్తార్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా

ముక్కుడుదేవుపల్లి ఏటి నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 10: మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. ఏపూరు, రామన్నగూడెం, ముక్కుడుదేవులపల్లి గ్రామాల ఏటి నుంచి గత 15 రోజులుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దందాకు అధికారులు అంతర్గతంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు ఇల్లు కట్టుకునేందుకు ఇసుక కావాలని కోరినప్పటికీ దొరకని పరిస్థితి. బయట ఎక్కువ ధర పలుకుతుండడంతో ఇసుక దందా సాగించే వారు స్థానికులకు విక్రయించడం లేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఏపూరు గ్రామానికి చెందిన రావుల సంజీవ ఇంటి నిర్మాణం కోసం ఇసుక కావాలని ఇసుక విక్రయించేవారిని అడుగగా బయట ఊర్లలో ఎక్కువ ధర వస్తుందని, స్థానికులకు తక్కువ రేటుకు అమ్మలేమని తెలిపారు. గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలించడమే కాకుండా గ్రామస్తులకు విక్రయించకపోతే ఎలా అని ప్రశ్నించడంతో ఇసుక దందాకు పాల్పడే పలువురు ఈ నెల 7న అర్ధరాత్రి సంజీవ ఇంటికొచ్చి ఇష్టానుసారంగా దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు సోమవారం విలేకరులను ఆశ్రయించాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

'విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 10: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కృషి విద్యాలయంలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడొద్దని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, పోలీస్ సిబ్బంది గోపి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికుల నుంచి నగదు అపహరణ

కోదాడ రూరల్, ఫిబ్రవరి 10: కోదాడ బస్టాండ్‌లో సోమవారం దొంగలు హల్‌చల్ చేశారు. ప్రయాణికులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఒకరి నుంచి రూ.10 వేలు, మరొకరి నుంచి రూ.20 వేలు అపహరించారు. అదేవిధంగా మరో మహిళ మెడలోని బంగారు మంగళసూత్రాలు అపహరించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల, ఫిబ్రవరి 10: దురాజ్‌పల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా మంగళవారం దురాజ్‌పల్లి, ఖాసీంపేట, వల్లభాపురం, ఉండ్రుగొండ, తుల్జారావుపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేళ్లచెర్వులో నేడు ఉచిత పశు వైద్య శిబిరం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 10: స్థానిక మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రేషన్ బియ్యం దందా చేసిన వారిపై పీడీ యాక్ట్'

మర్రిగూడ, ఫిబ్రవరి10: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ దందా చేసిన వ్యక్తులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. సోమవారం మర్రిగూడ శివారులో ఆటోలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రహసనం చేసే రేషన్ డీలర్లపై కూడా క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. ప్రజలు రేషన్ బియ్యాన్ని వినియోగించుకోవాలని, వాటిని అమ్మడం నేరమని స్పష్టం చేశారు.

పీజీ పరీక్ష కేంద్రాల తనిఖీ

రామగిరి, ఫిబ్రవరి 10 : ఎంజీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కోర్సుల పీజీ పరీక్ష కేంద్రాలను ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సోమవారం తనిఖీ చేశారు. యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

సకాలంలో డాటా ఎంట్రీ పూర్తిచేయాలి

నకిరేకల్, ఫిబ్రవరి10 : రేషన్ కార్డుల దరఖాస్తుల డాటా ఎంట్రీని సకాలంలో పూర్తిచేయాలని ఇన్‌చార్జి డీఎస్ఓ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నకిరేకల్ మున్సిపాలిటీ కార్యాలయంలో, తాసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల డాటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ప్రజాపాలన, గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఎంట్రీ రేపటి వరకు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ డి. బాలయ్య, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, డీటీసీఎస్ జ్యోతి ఉన్నారు.

12లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

రామగిరి, ఫిబ్రవరి 10: ఎంజీయూలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఈ నెల 13న నిర్వహించే పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 12లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంజీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ పి.మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఎంజీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ నిర్వహకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సంధ్య, కె.మాధురి, జి.సరితను సంప్రదించాలని కోరారు.

చెల్లని చెక్కు కేసులో రెండు నెలల జైలు

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 10: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి 2 నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట ప్రధాన ప్రథమశ్రేణి న్యాయమూర్తి రజిత సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేటలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన కనపర్తి సైదులు అనే వ్యక్తి బ్రహ్మదేవర వినోద్‌కుమార్ వద్ద 2018 ఆగస్టులో రూ.4,50,000 అప్పుగా తీసుకొని ప్రామిసరి నోట్ రాసి ఇచ్చాడు. వినోద్‌కుమార్ తిరిగి డబ్బుల కోసం పలుమార్లు అడిగినా సైదులు చెల్లించలేదు. 2019 జూలైలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా వడ్డీతో కలిపి మొత్తం రూ.5 లక్షలు చెల్లిస్తానని ఒప్పుకొని చెక్కు రాసి ఇచ్చాడు. వినోద్‌కుమార్ ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి రజిత వినోద్‌కుమార్‌కు రూ.7.40 లక్షలు చెల్లించాలని, అంతేకాకుండా సైదులు 2 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

నాటుసారా తయారీ స్థావరంపై పోలీసుల దాడి

బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 10: మండలంలోని జల్మలకుంట తండాలో వ్యవసాయ క్షేత్రం వద్ద నాటుసారాను తయారు చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఎస్ఐ కస్తాల గోపికృష్ణ సోమవారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. సారా తయారీదారుడిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నాటుసారా తయారు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వెంట సిబ్బంది ప్రవీణ్, లింగరాజు, రామాంజనేయులు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

చిలుకూరు, ఫిబ్రవరి 10: మండల కేంద్రం చిలుకూరులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్ పోటీ నిర్వహించారు. తొలుత క్విజ్ పోటీల ప్రశ్నాపత్రాన్ని ఎంఈఓ గురవయ్య, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నరసింహారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయంలో చోరీ

ఎమ్మార్సీ కార్యాలయంలో విచారణ చేపడుతున్న పోలీసులు

చిలుకూరు, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం తాళం పగులగొట్టి రెండు కంప్యూటర్ల సీపీయూలను ఎత్తుకెళ్లారు. సోమవారం కార్యాలయం శుభ్రం చేసేందుకు వచ్చిన స్వీపర్ దొంగతనం జరిగినట్లుగా గుర్తించి ఎంఈఓ గురువయ్యకు తెలియజేయడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

నేరేడుచర్ల: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, అధికారులు

చింతలపాలెం, ఫిబ్రవరి 10: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ హరిసింగ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఎంపీడీఓ ఆసిన్, ఎంపీఓ ఈశ్వర్, సూపరింటెండెంట్ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, తాసీల్దార్ అమీన్‌సింగ్ విడుదల చేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్

- ఎంఈఓ వెంకటేశ్వర్లు